ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 | సంచిక : 12 | ఆగష్టు 2012

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 03-07-2012, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున వ్యాసుడి యొక్క జయంతి. మన భారతీయ సాహిత్యానికి యిద్దరు మూలపురుషులు ఉన్నారు. 1. వాల్మీకి మహర్షి, 2. భగవాన్ వేదవ్యాసుడు. వేదాల యొక్క సారాన్ని వాల్మీకిమహర్షి రామాయణం రూపంలో తీసుకొనివచ్చాడు, వ్యాసుడు మహాభారతం రూపంలో తీసుకొనివచ్చాడు. వ్యాసుడు రాకపూర్వం వేదాలు రాశికింద ఉండేవి. ఒక రాశిగా ఉన్న వేదాలను ఆయన విభజించాడు కాబట్టి ఆయనకు వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. వేదవ్యాసుడి జన్మదినాన్ని గురుపూర్ణిమగా మన పెద్దలు ఏర్పాటు చేసారు. గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు అని అర్థం. మనకు బయట ఉన్న చీకటిని సూర్యుడు పోగొడుతున్నాడు, మన లోపల ఉన్న అజ్ఞానం అనే చీకటిని తొలగించే వాడే గురువు. మీరు ఏ సాంప్రదాయంలో ఉన్నా కనీసం గురుపూర్ణిమ రోజున అయినా ఎవరి గురువును వారు గౌరవించుకోవాలి, యిది గురుపూర్ణిమ రోజున మనం చేయవలసిన పని. మనకు ముగ్గురు ఆచార్యులు ఉన్నారు. శంకరుడు, రామానుజుడు, మధ్వాచార్యులు. ఈ ముగ్గురు కూడా మనం గౌరవింపదగినవారు, ముగ్గురుకూడా మహాపండితులు. ఆచార్యుడు అంటే సద్వస్తువును అనుభవైకవేద్యం చేసుకొని, దానిగురించి ఇతరులకు అర్థమయ్యేలాగా చెప్పేవాడు అంటే తన అనుభవాన్ని ఇతరులతో పంచుకొనేవాడిని ఆచార్యుడు అంటారు. రాముడు, కృష్ణుడు మనకు అవతారపురుషులే అయినా సాంప్రదాయ బద్ధంగా వారికి కూడా గురువులు ఉన్నారు. నారాయణుడు సుప్రీమ్ అని మధ్వాచార్యులు చెపుతారు కాని ఆయనకు శివుడి మీదగాని, ఇతర

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
హైదరాబాద్ .... 03-07-2012
ఖండవల్లి ........ 12-05-2012

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

దేవతల మీద కాని ద్వేషం లేదు. యితరులను ద్వేషించే బదులు విషం తాగటం మంచిది అని మధ్వాచార్యులవారు చెప్పారు. ద్వేషబుద్ధి ఉన్నవాడు దేనికి పనికిరాడు. వాడు మానసికంగా కుళ్ళిపోతాడు, వాడి శారీరకఆరోగ్యం పాడవుతుంది. మీకు ఇష్టమైన దైవాన్ని పూజించుకోండి కాని ద్వేషం మటుకు పనికిరాదు అని చెప్పాడు.

కర్మను యోగంగా చెయ్యాలి, కర్మను యోగంగా చేసేవాడే సన్యాసి, వాడే యోగి అని పరమాత్మ చెప్పాడు. భగవంతుని యందు ప్రేమ లేకుండా, ఆయన మీద భక్తిలేకుండా భగవంతుని యందు మన మనస్సును నిలబెట్టలేము. మా మనస్సు భగవంతుని యందు నిలబడటంలేదు అని చాలామంది చెపుతారు. మన మనస్సు భగవంతుని మీద నిలబడక పోవటానికి మమకారం కారణం. మమకారం ఉన్నంతకాలం మోక్షం పొందటానికి అర్హత రాదు. మమకారం వలన భగవంతుడి యొక్క ఔన్నత్యం మనకు తెలియటంలేదు. భగవంతుడి యొక్క వైభవం మీకు తెలియకుండా, ఆయన యొక్క కళ్యాణగుణాలు మీకు తెలియకుండా, భగవంతుడిలో ఉన్నటువంటి శాంతి, సుఖం, జ్ఞానం మీకు తెలియకుండా, భగవంతుడి గురించి శ్రవణం చేయకుండా ఆయన మీద మీకు అసలు ప్రేమ కలుగదు. భగవంతుడి మీద మీ మనస్సు నిలబడటం లేదు అంటే అసలు భగవంతుడి గురించి మీరు ఎప్పుడైనా శ్రవణం చేసారా? మీకు భగవంతుడి మీద ప్రేమ లేనప్పుడు ఇంక మీ మనస్సు ఆయన మీద ఏమి నిలబడుతుంది. మనందరకు సబ్జక్టు అర్థంకాకపోవడానికి, మనం పాడైపోవడానికి రాగద్వేషాలే కారణం.

భగవంతుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు. అది మనకు తెలిసినా, తెలియకపోయినా మనందరి హృదయాలలో భగవంతుడు ఉన్నాడు. అది తెలుసుకొన్నవాడిని ఋషి అంటున్నాము. తెలియని వాడిని పామరుడు అంటున్నాము. ఆ పామరుడి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు కాని అది వాడికి తెలియటంలేదు, అది తెలుసుకోవటమే మన లక్ష్యం. అది తెలిస్తే మనం సుఖపడతాము, తెలియకపోతే ఆజన్మకు ఆజన్మ దుఃఖం మనలను వెంటాడుతుంది. భగవంతుడు సత్యాన్ని చూస్తూ ఉంటాడు. ఏదైనా తప్పు చేసినప్పుడు మనం వాడిని కోర్టుకు తీసుకొనివెళ్ళి వాడికి వేయించే శిక్ష కంటే ఈశ్వరుడు వేసే శిక్ష చాలా సివియర్‌గా ఉంటుంది. ఆయన తీర్పు ఇవ్వడానికి కొంచెం లేట్ చేస్తాడు, ఈలోపుగా మనకు సహనం సరిపోదు. ఒక భక్తుడితో ప్రభువు ఏమన్నాడు అంటే నువ్వు చాలా భక్తిగా ఉంటున్నావు, నీ భక్తికి సంతోషిస్తున్నాను, రేపు వచ్చి కనిపిస్తాను అని చెప్పాడు. ఆ భక్తుడి పని ఏమిటి అంటే చెప్పులు బాగా కుడతాడు. వాడు ఏ ఉద్యోగం చేస్తున్నాడు

అనేది భగవంతుడు చూడడు, చేసే పని ఎలా చేస్తున్నాడు అనేది భగవంతుడు చూస్తాడు, దానిని బట్టే ఆయన దయ మనకు కలుగుతుంది. మరుసటిరోజున భగవంతుడు బాలుడిరూపంలో, మధ్యవయస్సు ఉన్నరూపంలో, వృద్ధుడిరూపంలో ఆ భక్తుడి దగ్గరకు వచ్చాడు. ముందుగా బాలుడి రూపంలో వచ్చి నా చెప్పలు పాడైపోయినాయి, కుట్టిపెట్టు అన్నాడు. నాకు దేవుడు కనిపిస్తాను అన్నాడు, ఆయనకోసం ఎదురుచూస్తున్నాను, నువ్వు వెళ్ళిపో అని ఆ భక్తుడు చెప్పాడు. తరువాత మధ్యాహ్నం మధ్యవయస్సు ఉన్నవాడి రూపంలో వచ్చి చెప్పలు బాగుచేయమని అడిగాడు. నేను భగవంతుడి కోసం ఎదురుచూస్తున్నాను, నీచెప్పలు ఇప్పుడు బాగుచెయ్యను అని చెప్పాడు. సాయంత్రం వృద్ధుడిరూపంలో వచ్చాడు. నాకు ఈ రోజు దేవుడు కనిపిస్తాను అనిచెప్పాడు. నేను చెప్పలు కుట్టే పనిలో ఉంటే ఆయన వచ్చి వెళ్ళిపోతాడు అందుచేత నీ చెప్పలు ఇప్పుడు కుట్టను వెళ్ళిపో అన్నాడు. మరుసటి రోజు దేవుడు కనిపించాడు. ఏమయ్యా నిన్న కనిపిస్తాను అని చెప్పావు కనిపించలేదు ఏమిటి అని భక్తుడు అడిగాడు. నిన్నే మూడురూపాలలో నీ దగ్గరకు వచ్చాను. నువ్వు గుర్తించలేదు. దేవుడు అంటే ఏదో ప్రత్యేక రూపంలో ఉంటాడు అనుకొంటున్నావు. నిన్న బాలుడిగా, మధ్యవయస్కుడిగా, ముదుసలిగా వచ్చినవాడిని నేనే. అందరి హృదయాలలో దేవుడు ఉన్నాడు అనే గుర్తింపు నీకు లేదు. దేవుడు అనేవాడిని ప్రత్యేకంగా ఒక రూపానికో, ఒక నామానికో బంధిస్తున్నావు. దేవుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, ఆయన సర్వజ్ఞుడు, ఈ ప్రపంచాన్ని అంతా నియమించేవాడు ఆయనే, ఆయన లేనిచోటు అంటూ లేదు అని వివరంగా చెప్పాడు. నిర్గుణం గురించి, నిరాకారం గురించి నీకు తెలియటంలేదు. అంతటా వ్యాపించి ఉన్న భగవంతుడిని ఒక రూపానికి, ఒక నామానికి పరిమితం చేయటం అనేది ఆయనను అగౌరవపరచటం అని చెప్పాడు. భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. మీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఒకమాట చెపుతాను. మనలో అంతర్యామిగా ఉన్నవాడే నిజం. బయట ఉన్న గుళ్ళు, గోపురాలు యివన్నీ మన మనస్సు కల్పించిన విషయాలే.

మన కాళ్ళకు తొడుక్కొనే చెప్పలు ఎటువంటివో డబ్బు కూడా అటువంటిదే అని బాబాగారు చెప్పారు. అలా ఎందుకు చెప్పారంటే మనం చెప్పలు కొనుక్కొనేటప్పుడు అవి మనకాలుకు సరిపోతాయా లేదా అని చూసుకొంటాము. ఆది సరిపోకపోతే అవి మన కాలుకు పట్టవు. కాలు చిన్నది అయిపోయి చెప్పలు పెద్దవి అయిపోతే వాటితో నడిచేటప్పుడు మనం పడిపోతాము. అలాగే మీకు ఉన్న డబ్బు మీ సంసారం నడవటానికి సరిపోకపోతే మీరు బాధపడతారు. మీ సంసారం నడవటానికంటే మీకు ఉన్న డబ్బు ఎక్కువ అయిపోయింది

అనుకోండి అక్కడనుండి భోగాలు అనుభవించాలనే బుద్ధి కలుగుతుంది. ధనం పెరుగుతూ ఉంటే మదం పెరుగుతుంది, దేహభావన పెరుగుతుంది. డబ్బు బాగా పెరిగితే అది ఏమి చేసుకోవాలో తెలియక బజారులో పడి భోగానికి పనికి వచ్చే సామాగ్రి అంతాకొని, ఆ భోగాలు అనుభవిస్తూ రోగాలు తెచ్చుకొని చివరకు పూర్తిగా పతనమైపోతారు. మన కాళ్లకు సరిపడా జోడు ఉంటేనే మనకు సుఖం. అలాగే మనకు డబ్బు ఎక్కువ అవ్వకుండా, అలాగని డబ్బు సరిపడక ఇబ్బందులు పడకుండా సామాన్యంగా ఉంటేనే మనం సంతోషంగా జీవించగలము. ద్వేషం ఉన్నవాడు, కాంక్ష ఉన్నవాడు సన్యాసి అవ్వలేడు, వాడు ఎర్ర బట్టలు కట్టుకొన్నా సన్యాసి కాలేడు. మీరు తెల్ల బట్టలు కట్టుకొన్నా యోగి అవ్వవచ్చు. అది మనస్సును, యింద్రియాలను నియమించుకోవటంలో ఆయోగస్థితి మీకు వస్తుంది కాని బట్టలు మార్చుకోవటం వలన కాదు. డబ్బు ఉన్నవారు కంఫర్ట్సు ఎక్కువ పెంచుకొంటారు. మన మనస్సును కంట్రోలు చేసుకోవటం వలన వచ్చే ఆనందం కంఫర్ట్సు వలన రాదు. మీకు ఏదైనా కోరిక వచ్చినప్పుడు ఆకోరికను సంతృప్తి పరిస్తే అది పెరిగిపోతుంది. సంతృప్తి పరచిన కోరిక యింకో కోరికను తీసుకొని వస్తుంది. అందుచేత కోరికను సంతృప్తి పరిస్తే అది పెరిగిపోతుంది. దానిని కంట్రోలు చేయటం వలన మీరు శాంతికి వారసులు అవుతారు.

మనం నిదానంగా జీవించలేకపోవటానికి, మనకు సబ్జక్టు సరిగా పట్టకపోవటానికి రాగద్వేషాలు కారణం. మీరు రాగద్వేషాలు వదిలేసి ఒకరోజు గడిపితే అది మీకు తెలుస్తుంది. మీకు ఎక్కడా యిష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి, ఇంక మీమనస్సును కదలమన్నా అది కదలదు. మీమనస్సు ఒక వస్తువుమీదగాని, ఒక వ్యక్తిమీదగాని వాలుతోంది అంటే అక్కడ మీకు మమకారం ఉంది. మనస్సు యొక్క చలనానికి ఎటాచ్‌మెంట్ కారణం, అదే మీకు సమస్యలను తీసుకొని వస్తుంది. కొన్ని ప్రాంతాలలో కక్షలు ఎక్కువగా ఉంటాయి. ఎవరైనా వారిని చంపుతారని అనుమానం వస్తే ముందుగా వీళ్లే వెళ్లి వారిని చంపేస్తారు. అలాగే రాగద్వేషాలు మనలను చంపకముందే మనం వాటిని చంపేయాలి. రాగద్వేషాలను మనం చంపము అనుకోండి అవి మనలను చంపేస్తాయి అందుచేత అవి మనలను చంపకముందే మనం వాటిని చంపేస్తే మనం ఆనందంగా ఉండవచ్చు.

మనస్సు యొక్క చలనాన్ని ఆపు చేయటానికి జపం చేయమని, ధ్యానం చేయమని మన సాంప్రదాయంలో చెప్పారు. మీరు జపంచేసి, ధ్యానంచేసి మనస్సును ఎంతకాలం ఆపుచేస్తారు. అసలు మనస్సుకు చలనం ఎందుకువస్తోంది. మీకు ఇష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి అసలు మీ మనస్సును కదలమన్నా అది కదలదు. యింక ఈజపాలు,

ధ్యానాలు ఎందుకు? అసలు ఈజపం చేసే జపి ఎవడు అంటే అదే మనస్సు, దానికే ఈ రాగద్వేషాలు. అందుచేతనే మీమనస్సును మీరు బాగుచేసుకోండి అని పరమాత్మ గీతలో చెప్పాడు. మీ మనస్సును బాగుచేసుకోవటానికి, మీ మనస్సును పవిత్రం చేసుకోవటానికి కృషి చేయండి. ఎవరోవచ్చి మీ మనస్సును బాగుచేస్తారని, మిమ్మల్ని ఉద్ధరిస్తారని కనిపెట్టుకొని ఉండవద్దు. మన శరీరంలో చాలా యింద్రియాలు ఉన్నాయి, అన్ని ఇంద్రియాలు మనస్సును బాహ్యముఖానికి తీసుకొని పోతాయి. ఇంద్రియాలను కంట్రోలు చేయాలంటే మీరు ప్రయత్నం చేసినా ఈశ్వరానుగ్రహం ఉండాలి. కేవలం మనం చేసే సాధన వలన మనస్సు కంట్రోలు లోనికి రాదు. ఈశ్వరానుగ్రహం అవసరం. అనుగ్రహానికి అంతా సాధ్యమే, దానికి అసాధ్యమంటూ ఏమీ లేదు. రాగద్వేషాలను బయటకు తోలేస్తే మనస్సు అంతర్ముఖమవుతుంది. మనస్సు అంతర్ముఖమైనవాడిని ప్రారబ్ధం కూడా ముట్టుకోదు అంటే ప్రారబ్ధం యొక్క ప్రభావం వాడిమీద ఉండదు. మీకు ఆత్మానుభవం కలిగితే సంచితం, ఆగామి అనుభవించనక్కరలేదు కాని ప్రారబ్ధాన్ని అనుభవించాలి అని శాస్త్రంలో చెపుతారు. ప్రారబ్ధం కూడా అనుభవించనక్కరలేదు అంటే పుట్టినదానికి ప్రారబ్ధం కాని పుట్టని దానికి ప్రారబ్ధం అంటూ ఏమీ లేదు మనం పుట్టిన దానితో తాదాత్మ్యం పొందుతున్నాము. అందుచేత ఈగొడవ అంతా వస్తోంది. మనం పుట్టని వస్తువుతో తాదాత్మ్యం పొందాలి అప్పుడు ఏగొడవ లేదు.

అన్ని కాలాలలో, అన్ని ప్రదేశాలలో, అన్ని అవస్థలలో ఏదైతే అంతటా వ్యాపించిఉందో దానినే మన వేదాంత శాస్త్రంలో బ్రహ్మపదార్థం అంటారు. ఆ బ్రహ్మపదార్థము మీరు తెలుసుకొనేది కాదు, అది తెలియబడేది, దానిమీద మీకు సజీవమైన విశ్వాసం ఉండాలి. లోపల ఉన్న సద్వస్తువు అది మీకు ఎప్పుడు తెలియబడాలో అదే నిర్ణయిస్తుంది కాని మనం అనుకొంటే అది తెలియబడదు. దేహం చనిపోయిన తరువాత మనం ఉండము అని అనుకొంటున్నాము, అందుచేత మరణం అంటే అందరికీ భయం. మనందరికి ఉండాలని ఉంది కాని చనిపోవాలని ఎవరికీ లేదు. ఉండాలని ఉండటం న్యాయమే ఎందుచేతనంటే మన స్వరూపం ఉండటమే. ఆ ఉండే వస్తువు సుఖస్వరూపం, శాంతిస్వరూపం, ఆనంద స్వరూపం. నేను ఉన్నాను, ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను అని బైబిలు చెప్పింది. నేను ఉన్నాను అని మనం చెపుతున్నాము కాని ఆ ఉండే వస్తువు నేనై ఉన్నాను అనే అనుభవం మనకు లేదు. దానికి గురువు సహాయం అవసరం. మనకు రాగద్వేషములు ఉన్నప్పుడు మనం చేసే సాధనలు సక్సెస్ అవ్వవు, మనం ఏదైనా పుస్తకం చదివినా అది మనకు సరిగా అర్థం కాదు. బుద్ధుడు స్వతంత్రుడు. మనం ఏదైతే గ్రంథాలను ప్రమాణంగా తీసుకొన్నామో ఆయన

వాటిని ప్రమాణంగా తీసుకోలేదు. నీ అనుభవంతో ముందుకు వెళ్ళు అని చెప్పాడు. మనం ఏదైనా తప్పు చేసినప్పుడు అది తప్పు అని మన బుద్ధి చెపుతుంది. మనం ఎంతసేపు మనస్సు చెప్పింది వింటాము గాని బుద్ధి చెప్పింది వినము. మనస్సు ఆలోచిస్తుంది, బుద్ధి నిర్ణయిస్తుంది. అప్పుడు మనం బుద్ధిని అనుసరిస్తే మనం బాగుపడతాము. ఎప్పుడైతే మనకు విచక్షణా జ్ఞానం పోయిందో, వివేకం ఎప్పుడైతే పోయిందో అప్పుడు మనస్సు మనమీద పెత్తనం చేస్తుంది. శరీరం చనిపోవటం అనేది సహజం. శరీరం చనిపోయేటప్పుడు చావని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. దానికి చావులేదు, పుట్టుక లేదు, దుఃఖం లేదు, అది లేదా అంటే అది ఉంది. లోపల ఉన్న సద్వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు అది ఉండటం వలనే అది మీకు తెలియబడుతూ ఉంటుంది కాని దానిని చూపించటానికి రెండో వస్తువు అక్కరలేదు. మనం అమృతానుభవం పొందాలి అంటే యిప్పుడు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేనుకు ఆహారం అందకుండా చూసుకోవాలి అంటే ఆ నేనుకు ఫుడ్ సప్లయిని కట్ చేయాలి.

నన్ను సంతోషపరిచే పనులు చెయ్యి అని పరమాత్మ చెపుతున్నాడు. దానివలన నువ్వు కానిదానితోటి విడిపోవటం నేర్చుకొంటావు. ఇప్పుడు నువ్వు కానిదానిని నువ్వు అనుకొంటున్నావు. నాకు ప్రీతి అయిన పనులు చేస్తూఉంటే నువ్వు కాని శరీరంతోటి, నువ్వు కాని మనస్సు తోటి సెపరేట్ అవ్వటం నెమ్మదిగా అలవాటు అయిపోతుంది. సర్వసాధారణంగా మనిషి వాడి అహంకారాన్ని సంతృప్తిపరుచుకోవటానికే పనిచేస్తాడు. మనిషికి కొంత ఏకాంతవాసం అవసరం. మీ ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చుని ఆలోచించండి. మనిషి వాడి అవసరాలు తీరిన తరువాత కూడా వాడి అహంకారాన్ని సంతృప్తి పరుచు కోవటానికి పనులు చేస్తూ ఉంటాడు. అలాకాదు నన్ను సంతోషపెట్టేపనులు చేయండి అని పరమాత్మ చెపుతున్నాడు. ఈ పని చేస్తే ఈశ్వరుడు సంతోషిస్తాడు అని ఆ విచక్షణ జ్ఞానం పెంచుకొని నా కోసం మీరు పని చేస్తూ ఉంటే నా అనుగ్రహానికి మీరు పాత్రులవుతారు.

నన్నే గమ్యంగా పెట్టుకో అని పరమాత్మ చెపుతున్నాడు. మీరు అనేక పనులు చేసుకొంటూ ఉంటారు. మీరు ఏదైనా ఒక పని చేసేటప్పుడు, ఒక మాట మాట్లాడేటప్పుడు నీ హృదయంలో ఏ ప్రేరణవలన ఆ పని చేసావు, ఏ ప్రేరణ వలన నీకు ఆమాట వచ్చింది అది భగవంతుడు చూస్తాడు, దానిని బట్టి నీకు స్పిరిట్యువల్ స్టేటస్ ఇస్తాడు. నీ వృత్తిధర్మం ఏదో నువ్వు చేసుకొన్నప్పటికీ నీ హృదయంలో మటుకు భగవంతుడినే గమ్యంగా పెట్టుకోవాలి. భగవంతుడిని ప్రేమించు, ఆయన యందు భక్తి కలిగి ఉండు. ప్రపంచంతోటి మనం అతిగా

ఉండకూడదు ఇప్పుడు మనందరం ప్రపంచానికి దగ్గరగా ఉంటున్నాము, భగవంతుడికి దూరంగా ఉంటున్నాము. ఈ సమాజంతో ఎంతవరకు సంబంధం అవసరమో అంతవరకే సంబంధం పెట్టుకోవాలి కాని నువ్వు అతిగా ఉండకూడదు. అతిగా ఉంటే నీకు అహంకారం పెరిగిపోతుంది, అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మరిచిపోతావు. అందుచేత ప్రపంచంతోటి నీకు ఉన్న సంఘబుద్ధిని తగ్గించుకో. సోమరితనం వద్దు, శరీరయాత్రకు సరిపడ పనిచేసుకో. సమాజంతో అతిగా ఉంటే నీ స్వరూపానికి దూరమవుతావు. ఏ ప్రాణికోటితోటి వైరం పనికి రాదు. ఎందుచేతనంటే మీకు ఎవరిమీద అయితే వైరం ఉందో వాడే అస్తమానూ జ్ఞాపకం వస్తాడు కాని ఇంక భగవంతుడు మనకు జ్ఞాపకం రాడు. మనకు ఎవరైనా అపకారం చేసినా దానికి ఏదైనా పరిష్కారం ఉంటే పరిష్కారం చేసుకోవచ్చును కాని వైరం పెట్టుకోవద్దు. కొంతమందికి దీర్ఘకాలం కోపం ఉంటుంది, అది మంచిది కాదు. సత్పురుషుడికి కూడా ఎప్పుడైనా కోపం వస్తుంది అది నీటిమీద గీతలాంటిది. నీటిమీద గీతగీస్తే ఎంతసేపు ఉంటుందో సత్పురుషుడికి వచ్చేకోపం కూడా అలాగే ఉంటుంది. నీకు ఎవరిమీద ద్వేషం పనికిరాదు, వైరం పనికిరాదు. ద్వేషబుద్ధిని, వైరబుద్ధిని తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యి.

నువ్వు ఏదైనా మాట్లాడితే నాకు సంబంధించిన మాటలే మాట్లాడాలి. నువ్వు ఏదైనా పనిచేస్తే నా అనుగ్రహం సంపాదించుకొనే పనులుమాత్రమే చెయ్యాలి. నువ్వు చిరకాలం, కలకాలం నాకు భక్తుడిగా ఉండు. నువ్వు స్వతంత్రుడవు అయిపోకు. బాహ్య పరిస్థితులను చూసుకొని, మీకు ఉన్న అధికారాన్ని, డబ్బును చూసుకొని, లేనిపోనివి ఏవో కల్పించుకొని, బయటగొడవలు అన్నీ నెత్తిమీద పెట్టుకొని మేము పెద్దవాళ్ళము అయిపోయాము అని అనుకోవద్దు. ఈ మధ్య అందరికీ పెద్దరికాలు అంటే ఇష్టంగా ఉంది. ఒకవేళ మనం మంచి పనులు చేస్తున్నా మాతోటి చెప్పకుండా ఎందుకు చేస్తున్నారు అని అడుగుతున్నారు. ఎవడికి పెద్దరికం ఇవ్వకపోతే వాడికి కోపం. మనం వినయంగా ఉండి, భగవంతుడు చెప్పినట్లుగా నడుచుకోవాలి కాని నేను ఏదో పెద్దవాడిని అయిపోయాను అని మనలో మనం ఊహించుకోకూడదు. భగవాన్ తల్లికి ఏమని చెప్పారంటే జరగవలసింది జరిగేతీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. ఈ సృష్టి అంతా ఈశ్వర సంకల్పంతోటి నడుస్తోంది. శక్తి నీది కాదు, శక్తి ఈశ్వరుడిది. నాకు కోరిక ఉంటే ఆ ఫలితం వస్తుంది, కోరిక లేకపోతే ఫలితం రాదు అనుకొంటున్నావు. కోరికకు శక్తిలేదు. శక్తి ఈశ్వరుడిది. నీకురావలసింది నీ సంకల్పం లేకపోయినా వచ్చి నీ నెత్తిమీద పడుతుంది. నీకు భగవంతుడు ఏదైతే ఇవ్వకూడదు అనుకొన్నాడో దానిమీద నువ్వు ఎంత మనస్సు

పెట్టినా, దానికోసం ఎంత ప్రయత్నం చేసినా అదిరాదు. వచ్చేదేదో వస్తుంది, రానిదేదో రాదు. మనం కోరుకోకుండా వచ్చింది స్వీట్‌గా ఉంటుంది, అది నిన్ను బంధించదు. కోరికతో తెచ్చుకొన్నది మనిషిని బంధిస్తుంది.

నీకు ఏదైనా వస్తే అది ఈశ్వరానుగ్రహం వలన వచ్చిందే, అది ఈశ్వరుని ప్రసాదమే. అందుచేత ఏదీ నీ సొంతం అనుకోవద్దు. నీ దగ్గర పదిరూపాయలు ఉన్నా దానికి ఓనర్ ఈశ్వరుడే కాని నువ్వు కాదు. ఈ లోకానికి కర్త ఎవరు అంటే ఈశ్వరుడే కర్త అయితే నేను కర్తను అని నువ్వు అనుకొంటున్నావు అందుచేత నీకు దుఃఖం వస్తోంది. సబ్జక్టు నీకు సరిగా అవగాహన కాకపోవటం వలన నువ్వు సాధనచేసినా దుఃఖరహితస్థితిని పొందలేక పోతున్నావు. అనుకొనేది అంతా మనస్సు సకల్పం, జరిగేది అంతా ఈశ్వరసంకల్పం అని నోటితో చెప్పటం కాదు, అది మీకు అనుభవంలోనికి రావాలి. కొన్ని విషయాలు మన యింద్రియాలకు అందవు, మనస్సుకు అందవు, అనుభవానికి అందుతాయి. అందుచేత అనుభవం వచ్చేవరకు కొన్ని విషయాలు మనకు అర్థంకావు. జరిగేది అంతా ఈశ్వర సంకల్పం అనేటటువంటి ఈ వాక్యం నీ రక్తంలో కలిసిపోతే అప్పుడు సుఖం నీకు తెలుస్తుంది, దుఃఖస్పర్శ లేని స్థితిని పొందుతావు. ఈ ప్రపంచంలో ఉన్న మనుషుల మీదకాని, వస్తువుల మీదకాని ఆధారపడకుండా స్వతంత్రమైన సుఖం, ఆనందం మీకు అనుభవంలోనికి వస్తే ఇంకమీకు పునర్జన్మ లేదు. ఎందుచేతనంటే ఇంక మీకు శరీరంతో పనిలేదు. శరీరం అవసరం లేకుండా నువ్వు పొందవలసిన ఆనందం పొందుతున్నావు కాబట్టి ఇంక నీకు పునర్జన్మ రాదు. ప్రాణంపోయే చివరి టైములో నీకు పునర్జన్మ వస్తుందో, రాదో నిర్ణయింపబడుతుంది. ముగింపులేని సుఖం, ముగింపులేని ఆనందం అది నువ్వు చివరి టైములో ఎంజాయ్ చేయగలిగితే యిదే నీకు చివరిజన్మ, ఇంక నీకు పునర్జన్మ లేదు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-05-2012, ఖండవల్లి)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భీష్ముడు మహాజ్ఞాని, భక్తుడు, మహావీరుడు, మహాబలవంతుడు. ఒక చిన్నమాట పోషించుకోవటానికి జీవితం అంతా బ్రహ్మచర్యం అవలంబించినవాడు. అంత మహాజ్ఞాని కూడా అధర్మపక్షంలో ఉన్నాడు. ధర్మం ఎక్కడ ఉందో, న్యాయం ఎక్కడ ఉందో ఆయనకు తెలుసు. కానీ దేహప్రారబ్ధం తప్పించటం కష్టం. ప్రారబ్ధం చాలా బలీయమైనది. ఆ ప్రారబ్ధం వలన ఆయన అధర్మపక్షంలో ఉండవలసివచ్చింది. ఆయనని ఎవరూ చంపలేరు. కాని